నేటి నుంచి పారిశుధ్య వారోత్సవాలు

పార్వతీపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం నుంచి ఆగస్టు 2 వరకు పారిశుధ్య వారోత్సవాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రతిరోజూ చేపట్టిన కార్యక్రమాలను ఫొటోలతో పాటుగా తనకు పంపించాలన్నారు ఫాగింగ్ మిషన్లు సిద్ధం చేయాలని, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను శుభ్రపర్చాలని, మంచినీటి నాణ్యత పరీక్షించాలని కలెక్టర్ తెలిపారు.

సాగునీటి ప్రాజెక్టులు అస్తవ్యస్తం

- అభివృద్ధిని పట్టించుకోని గత సర్కారు
- ఐదేళ్లూ తీవ్ర నిర్లక్ష్యం
- ఆధునికీకరణకు నోచుకోని కాలువలు
- అర్థాంతరంగా నిలిచిన పనులు
- ఆయకట్టుకు పూర్తిస్థాయిలో అందని సాగునీరు
- కూటమి ప్రభుత్వంపైనే రైతుల ఆశలు

గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా గాలికి వదిలేసింది. ఐదేళ్ల పాటు తీవ్ర నిర్లక్ష్యం చేసి వాటిని అస్తవ్యస్తం చేసింది. ఆధునికీకరణకు రూపాయి కూడా విదల్చలేదు. దీంతో పూడిక, గుర్రపుడెక్క పేరుకుపోయి కాలువలు అధ్వానంగా తయారయ్యాయి. కాంట్రాక్టర్లకు కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనులను ఎక్కడికక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ఫలితంగా ఆయకట్టు భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదు. సిబ్బంది కొరతతో కాలువలపై పర్యవేక్షణ కరువైంది. కూటమి ప్రభుత్వంలో సాగునీటి ప్రాజెక్టులు బాగుపడతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

(పార్వతీపురం-ఆంధ్రజ్యోతి/ జియ్యమ్మవలస/కొమరాడ)



ఆధునికీకరణకు నోచుకోని వట్టిగెడ్డ రిజర్వాయర్

జిల్లాలో తోటపల్లి, జంఝావతి, వెంగళరాయ సాగరం, వట్టిగెడ్డ, పెద్దగెడ్డ, పెదంకలాం సాగునీటి ప్రాజెక్టులతో పాటు మైనర్ ఇరిగేషన్ చెరువులు సుమారు 2,352 ఉన్నాయి. తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు మినహా మిగిలిన మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులతో పాటు చెరువుల ద్వారా సుమారు 1,26,547 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. అయితే, వీటి పరిధిలోని కాలువలు అధ్వానంగా ఉండడంతో పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు కాలువలను నిర్లక్ష్యంగా వదిలేసింది. ఏ కాలువను కూడా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవు. పూడికలు, గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు తొలగించలేదు. దీంతో ఆయా ప్రాజెక్టుల ద్వారా పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు నష్టపోతున్నారు. జంఝావతి ఎగువ, దిగువ కాలువల నుంచి 24 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా కేవలం 8 వేల ఎకరాలకు మాత్రమే అందుతుంది. అలాగే, వెంగళరాయ సాగరం ద్వారా మక్కువ, సీతానగరం మండలాల్లోని 18,522 ఎకరాలకు, వట్టిగెడ్డ రిజర్వాయర్ ద్వారా కురుపాం, జియమ్మవలస, గరుగుబిల్లి మండలాల్లో 16,684 ఎకరాలకు, పెద్దగెడ్డ ద్వారా పాచిపెంట, సాలూరు మండలాల్లోని 9146 ఎకరాలకు, పెదంకలాం ఆయకట్టు ద్వారా బలిజిపేట మండలంలో 6,617 ఎకరాలకు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల ద్వారా 75,578 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. కానీ, ఏ ప్రాజెక్టు నుంచి కూడా దిగువనున్న ఆయకట్టు భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదని రైతులు చెబుతున్నారు.

బిల్లులు పెండింగ్..

సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విదల్చలేదు. మంజూరైన జపాన్ నిధులు కూడా ఖర్చు చేయలేదు. దీంతో కాలువలు అధ్వానంగా తయారయ్యాయి. వెంగళరాయ ప్రాజెక్టుకు సంబంధించి కాలువల ఆధునికీకరణ, తదితర పనులు చేపట్టేందుకు 2021-2022 ఆర్థిక సంవత్సరంలో రూ.48.89 కోట్లతో టెండర్లు ఖరారయ్యా యి. కాంట్రాక్టర్ 22 శాతం పనులు పూర్తి చేసి మిగిలినవి వదిలేశాడు. సుమారు రూ.6.28 కోట్ల బిల్లులను జగన్ సర్కార్ చెల్లించకపోవడమే దీనికి ప్రధాన కారణం. పెద్దగెడ్డ రిజర్వాయర్ పనులు చేపట్టేందుకు రూ.23.83 కోట్లతో టెండర్లు ఖరారయ్యాయి. 2021-22లో పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేసుకున్నాడు. సుమారు రూ.1.47కోట్లతో పది శాతం పనులను పూర్తి చేశాడు. దీనికి సంబంధించి బిల్లులను వైసీపీ ప్రభుత్వం చెల్లించక పోవడంతో కాంట్రాక్టర్ ఎక్కడి పనులు అక్కడే ఆపేసి తట్టాబుట్ట సర్దుకొని వెళ్లిపోయాడు.

వట్టిగెడ్డ రిజర్వాయర్‌దీ ఇదే పరిస్థితి. దీన్ని అభివృద్ధి పనులు చేసేందుకు రూ.44.85 కోట్లు మంజూరు కావడంతో కాంట్రాక్టరు పనులు ప్రారంభించి 15 శాతం పూర్తిచేశాడు. సుమారు రూ.40లక్షల పెండింగ్ ఉండడంతో పనులకు దండం పెట్టి కాంట్రాక్టర్ వెళ్లిపోయాడు. అలాగే, పెదంకలాం ఆయకట్టు ఆధునికీకరణకు రూ.17.30కోట్లు మంజూరు కావడంతో కాంట్రాక్టర్ కొన్ని పనులు చేశాడు. రూ.36 లక్షల బిల్లులను అప్‌లోడ్ చేయగా వైసీపీ సర్కారు చెల్లించక పోవడంతో మిగతా పనులు ఆపేశాడు. ఇలా జిల్లాలో ఈ ఏ ప్రాజెక్టు పనులు చూసినా అసంపూర్తిగానే ఉన్నాయి.



కొత్తవలస వద్ద జంఝావతి దిగువ కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క

సిబ్బంది కొరత..

సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణను చూసేందుకు అవసరమైన సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రధాన కాలువపై ప్రతీ ఐదు కిలో మీటర్లకు ఒక లస్కరు, డిస్ట్రిబ్యూటరీ పరిధిలో ప్రతీ 1500 ఎకరాలకు ఒక లస్కరు, రిజర్వాయర్‌లో పెద్ద రెగ్యులేటర్ ఉంటే అక్కడ ఒక లస్కరు, వీరందరినీ పర్యవేక్షణ చేయడానికి ఒక వర్క్ ఇన్‌స్పెక్టర్ కచ్చితంగా ఉండాలి. వీరితో పాటు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, హెల్పర్లు, వాచ్‌మెన్‌లు కూడా అవసరమైనంత వరకు ఉండాలి. కానీ, ఏ ప్రాజెక్టు పరిధిలో కూడా సిబ్బంది పూర్తి స్థాయిలో లేరు.

- వట్టిగెడ్డ ప్రాజెక్టు పరిధిలో 24 మంది లస్కర్లు ఉండాలి. కానీ ఒక్కరే ఉన్నారు. మజ్దూర్‌లు ఇద్దరు ఉన్నారు. వాచ్‌మెన్‌లు ముగ్గురు, హెల్పర్లు నలుగురు, ఎలక్ట్రీషియన్ ఒకరు, ఫిట్టర్ ఒకరు, వర్క్ ఇన్‌స్పెక్టరు ఒకరు కలిపి మొత్తం 36 మంది ఉండాల్సి ఉండగా ముగ్గురే ఉన్నారు. మిగిలిన 33 పోస్టులు ఖాళీ.
- పెద్దగెడ్డ రిజర్వాయర్‌కు 22 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ఎవరూ లేకపోవడం శోచనీయం.
- పెదంకలాం ప్రాజెక్టుకు ఆరుగురు సిబ్బంది ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉన్నారు. అతడు రామభద్రపురం సెక్షన్‌లో పనిచేస్తున్నాడు.
- వెంగళరాయసాగర్ పరిధిలో 41 మంది సిబ్బందికి గాను ఇద్దరు మెన్ మజ్దూర్‌లు, ఇద్దరు ఫిమేల్ మజ్దూర్‌లు మాత్రమే ఉన్నారు. మిగిలిన 37 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మొత్తం ఈ నాలుగు ప్రాజెక్టు పరిధిలో 102 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం 8 మందే పనిచేస్తున్నారు. 94 పోస్టులు భర్తీ కావల్సి ఉంది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వం టెండర్ సిస్టం ద్వారా కాలువల మెంటెనెన్స్‌కు లస్కర్లను సీజనల్ సమయంలో వేశారు. ఆ ఏడాది మూడు నెలలు మాత్రమే ఉంచి వారిని తొలగించారు. మళ్లీ 2020-21లో వీరిని తీసుకొని ఐదు నెలలు పనిచేయించుకొని జీతాలు ఇవ్వకుండా పక్కన పెట్టేశారు. దీంతో ప్రాజెక్టుల పరిధిలో ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీలపై పూర్తి పర్యవేక్షణ కొరవడింది. ఇంజనీర్లే అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. దీంతో అదనపు పనిభారంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు.



చినమేరంగి వద్ద వట్టిగెడ్డ బ్రాంచ్ కాలువ దుస్థితి



మరమ్మతులకు గురైన జంఝావతి ఎత్తిపోతల పథకం



పాడైన జంఝావతి షట్టర్

జంఝావతికి అరకొర నిధులు..

కొమరాడ మండలంలోని జంఝావతి ఎగువ, దిగువ కాలువల నుంచి 24 వేల ఎకరాలకు సాగునీరందించడమే లక్ష్యంగా రూ.124 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు పనులను చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వం బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించడంతో పూర్తిస్థాయిలో పనులు జరగక శివారు భూములకు సాగు నీరందడం లేదు. 27,790 కిలో మీటర్ల పొడవు ఉన్న ఎగువ కాలువ ద్వారా కొమరాడ, పార్వతీపురం, సీతానగరం మండలాల్లోని 12 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. అయితే, కొమరాడ మండలం దంగభద్ర వద్ద పెద్ద బండరాయి ఉండడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. దిగువ కాలువ నుంచి ఎగువ కాలువకు నీరును ఎత్తిపోసేందుకు ఏర్పాటు చేసిన పథకం మరమ్మతులకు గురికావడంతో కేవలం 700 ఎకరాలకు మాత్రమే నీరందుతుందని రైతులు చెబుతున్నారు. అలాగే, 26.925 కిలో మీటర్ల పొడువున దిగువ కాలువ ద్వారా గరుగుబిల్లి, పార్వతీపురం, కొమరాడ, సీతానగరం మండలాల్లోని 12 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. కాలువ పనులు జరిగినా నీరు మళ్లించే మదుముల వద్ద షట్టర్లు ఏర్పాటు చేయలేదు. పంట భూములకు సాగునీరు చేరేలా పిల్ల కాలువలను తవ్వాల్సి ఉంది. కొన్ని చోట్ల యూటీలు నిర్మించాలి. ఎగువ, దిగువ కాలువలకు కెనాల్ మెయింటెనెన్స్ డిస్ట్రిబ్యూటర్ చానల్స్ నిర్మించవలసి ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో జరగలేదు. దిగువ కాలువ ద్వారా ఏటా 7 వేల ఎకరాలకు మాత్రమే నీరందుతుందని రైతులు చెబుతున్నారు. రెండు కాలువల్లో గుర్రపు డెక్క పేరుకుపోవడంతో సాగునీరు ముందుకు సాగడం లేదు. దీనివల్ల గండ్లు పడతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

గత ఐదేళ్లలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన సాగునీటి ప్రాజెక్టులను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ముఖ్యంగా అసంపూర్తిగా పనులను పూర్తి చేయాలని విన్నవిస్తున్నారు. అలాగే, సిబ్బంది నియామకాల విషయంపై చొరవ చూపాలని వేడుకుంటున్నారు. ఇటీవల మంత్రి సంధ్యారాణి పర్యవేక్షణలో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రాజెక్టుల నిర్వహణ, ఆధునికీకరణ, తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. దీంతో తమ భూములకు పూర్తిస్థాయిలో సాగునీరందుతుందని ఆయకట్టు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

ప్రాజెక్టుల పరిధిలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటం వాస్తవమే. అయితే దీనిపై పూర్తి నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదించాం. ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకుంటుందని ఆశతో ఉన్నాం.

-వైవీ రాజరాజేశ్వరి, ఎస్ఈ, నీటి పారుదలశాఖ

జై జగన్నాథ

- ఘనంగా మారు రథయాత్ర



వీరఘట్టంలో ఊరేగిస్తున్న దృశ్యం



మక్కువలో..

పార్వతీపురం టౌన్/ మక్కువ/ వీరఘట్టం/ భామిని, జూలై 15: జిల్లా కేంద్రంలో జగన్నాథస్వామి మారు రథయాత్ర వైభవంగా జరిగింది. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు దుర్గాదేవి వీధిలోని గుండిచా మందిరంలో జగన్నాథ, సుభద్ర, బలరామ ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రూపు దేవాలయాల ఈవో ప్రసాదు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు త్రినాథ పండా వేదమంత్రోశ్చరణలు, మేళతాళాల మధ్య రథంలో ఉత్సవ విగ్రహాలను ఆశీనులు చేశారు. అనంతరం భక్తులు జై జగన్నాథ.. జైజై జగన్నాథ అంటూ గుడించా మందిరం నుంచి పాతబస్టాండ్ కూడలి వద్ద ప్రధాన ఆలయం వరకు రథాన్ని లాగారు. మారు రథయాత్రలో పార్వతీపురం నియోజకవర్గ ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొన్నారు. అదే విధంగా మక్కువ మండలంలోని మక్కువ, ఎస్.పెద్దవలస, భామిని మండలం బత్తిలి గ్రామాలతో పాటు వీరఘట్టం మండల కేంద్రంలో కూడా జగన్నాథుని మారు రథయాత్రను ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి రథయాత్రలో పాల్గొన్నారు.



ఉత్సవ విగ్రహాన్ని రథం వద్దకు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర



బత్తిలిలో..



పార్వతీపురంలో జగన్నాథుని దర్శించుకుంటున్న భక్తులు

ఏజెన్సీలో జ్వరాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ప్రతి ఒక్కరికీ రక్త పరీక్షలు చేయాలి
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సీతంపేట ఏరియా ఆసుపత్రిలో మలేరియా రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

సీతంపేట, జూలై 15: సీతంపేట ఏజెన్సీలో జ్వరాలు అధికంగా నమోదు అవుతున్నాయని, వాటిపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టసారించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. సోమవారం సీతంపేట ఏరియా ఆసుపత్రిని ఆయన సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రావును అడిగి తెలుసుకున్నారు. ఏ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జ్వరాల కేసులు నమోదు అవుతున్నాయో ఆ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య పనులు చేపట్టాలని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో మరణాలు సంభవించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సీతంపేట ఏరియా ఆసుపత్రికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో బ్లడ్ బ్యాంక్, ప్రత్యేక వార్డులకు అవసరమైన కరెంట్ సరఫరా కావడం లేదని సూపరింటెండెంట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాలు కురవడంతో డయేరియా, టైఫాయిడ్ ప్రబలే అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరికీ ముందుగా రక్త పరీక్షలు చేసి దానికి అనుగుణంగా వైద్యం అందించాలని ఆదేశించారు. అనంతరం కొత్తగా చేపడుతున్న ఏరియా ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి విష్ణుచరణ్, ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు పాల్గొన్నారు.

వినతులను చిత్తశుద్ధితో పరిష్కరించాలి..

గిరిజనులు నుంచి స్వీకరించిన వినతులను చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం సీతంపేట ఐటీడీఏ ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. 142 మంది గిరిజనులు తమ సమస్యలపై వినతులు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సీసీ రోడ్లు, రక్షణ గోడల నిర్మాణం కోసం ఎక్కువగా వినతులు వచ్చాయన్నారు. వాటితో పాటు ఆసుప త్రి సేవలు, ఉపాధి హామీ పనులు తదితర వాటిపై కూడా అర్జీలు అందాయన్నారు. ఫిర్యాదులు పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని అధికారులకు సూచించారు. పనులను పూర్తి చేయడానికి గ్రామస్థాయి వనరులు, ప్రజల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో సదరం సర్టిఫికెట్లు పొందేందుకు అవసరమైన కూపన్లు జారీ చేసేందుకు గ్రీవెన్స్ వద్ద కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. టెట్, డీఎడ్, బీఎడ్ అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వడానికి ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులను గుర్తించాలన్నారు. సంతలు, విశ్రాంతి స్థలాల వద్ద విద్యుత్ దీపాలు, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీతంపేట ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్, పాలకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ వర్సిటీలో బీటెక్, బీఎస్సీ ఆనర్స్

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)-ఎంపీసీ స్ట్రీమ్ కింద నిర్వహిస్తున్న డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బీటెక్, బీఎస్సీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కేటగిరీల్లో సీట్లు ఉన్నాయి. తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల భర్తీకి విడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. బీటెక్‌లో గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థుల కోసం అలాగే బీఎస్సీ ఆనర్స్‌లో రూరల్ కోటా కింద 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. స్థానికులకు 85 శాతం సీట్లు కేటాయించారు. ఆసక్తిగల తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.


బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్): సంగారెడ్డి-కందిలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో మొత్తం 29 సీట్లు ఉన్నాయి. ఫార్మర్స్ కోటా కింద 20 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 9 సీట్లను నిర్దేశించారు.

బీటెక్(ఫుడ్ టెక్నాలజీ): నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో మొత్తం 15 సీట్లు ఉన్నాయి. ఫార్మర్స్ కోటా కింద 10 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 5 సీట్లను నిర్దేశించారు.

బీఎస్సీ ఆనర్స్(కమ్యూనిటీ సైన్స్): హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో మొత్తం 42 సీట్లు ఉన్నాయి. వీటిలో 37 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి. మూడేళ్ల డిప్లొమా(హోమ్ సైన్స్) అభ్యర్థుల కోసం అదనంగా 8 రెగ్యులర్ సీట్లు కేటాయించారు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలంగాణ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

- ఫార్మర్స్ కోటాలో రిజర్వేషన్ సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే అభ్యర్థులు గ్రామీణ రైతు కుటుంబాలకు చెందినవారై ఉండాలి. తల్లిదండ్రుల పేరుమీద గానీ, అభ్యర్థి పేరు మీద గానీ కనీసం ఒక ఎకరం భూమి ఉండాలి. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి. బీఎస్సీ ఆనర్స్ (కమ్యూనిటీ సైన్స్) ప్రోగ్రామ్‌లో రూరల్ కోటా కింద అప్లయ్ చేసుకోవాలంటే కూడా గ్రామాల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి.



ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900
- **రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఆగస్టు 17
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 18
- **దరఖాస్తులో కరెక్షన్స్:** ఆగస్టు 19. ◆ **వెబ్‌సైట్:**www.pjtsau.edu.in

దిక్సూచి
DIKSUCHI

తెలంగాణ వ్యవసాయ కళాశాలల్లో డిగ్రీ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ), పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ(పీవీఎన్ఆర్‌టీవీయూ), సిద్దిపేట్-ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) ఉమ్మడిగా వ్యవసాయ ఆధారిత డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను విడుదల చేశాయి. బైపీసీ స్ట్రీమ్ కింద బీఎస్సీ ఆనర్స్, బీటెక్, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. వీటిలో రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్స్ కేటగిరీల సీట్లు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అగ్రికల్చరల్, వెటర్నరీ, హార్టికల్చర్ కాలేజీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. ప్రొఫెసర్ జయశంకర్, శ్రీ కొండా లక్ష్మణ్ వర్సిటీల పరిధిలో ఒక్కోదానిలో 40 శాతం సీట్లు; పీవీ నరసింహారావు వర్సిటీ పరిధిలో 25 శాతం సీట్లను గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థులకు ప్రత్యేకించారు. మొత్తమ్మీద 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. ఆసక్తిగల తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల భర్తీకి విడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

బీఎస్సీ ఆనర్స్

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అగ్రికల్చర్, కమ్యూనిటీ సైన్స్, హార్టికల్చర్ విభాగాలు ఉన్నాయి.
- పీజేటీఎస్ఏయూ పరిధిలోని రాజేంద్రనగర్, అశ్వారావుపేట, పొలాస, పాలెం, వరంగల్ అర్బన్, సిరిసిల్లా, ఆదిలాబాద్, తోర్నాల అగ్రికల్చరల్ కాలేజీల్లో మొత్తం 615 రెగ్యులర్ సీట్లు, 227 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి. సైఫాబాద్ కమ్యూనిటీ సైన్స్ కాలేజీలో 38 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఉన్నాయి.
- ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ పరిధిలోని రాజేంద్రనగర్, మోజెర్ల, మల్యాల్ హార్టికల్చర్ కాలేజీల్లో మొత్తం 200 రెగ్యులర్ సీట్లు, 34 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి.

బీటెక్

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. స్పెషలైజేషన్ 'ఫుడ్ టెక్నాలజీ'.
- పీజేటీఎస్ఏయూ పరిధిలోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(నిజామాబాద్ జిల్లా-రుద్రూర్)లో 25 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి.
- బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో 20 శాతం సీట్లను ఐకార్ కోటా కింద ప్రత్యేకించారు. వీటిని 'సీయూఈటీ(ఐకార్-యూజీ)2024' ఎగ్జామ్ స్కోర్, ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌ల ద్వారా ఐకార్ భర్తీ చేస్తుంది.

బీవీఎస్సీ & ఏహెచ్

- ప్రోగ్రామ్ వ్యవధి అయిదున్నరేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో వెటర్నరీ సైన్స్ ప్రధాన విభాగం. ◆ పీవీఎన్ఆర్‌టీవీయూ పరిధిలోని రాజేంద్రనగర్, కోరుట్ల, మామునూర్ వెటర్నరీ సైన్స్ కాలేజీల్లో మొత్తం 184 సీట్లు ఉన్నాయి.

బీఎఫ్ఎస్సీ

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో ఫిషరీ సైన్స్ ప్రధాన విభాగం.
- పీవీఎన్ఆర్‌టీవీయూ పరిధిలోని పెబ్బేర్ ఫిషరీ సైన్స్ కాలేజీలో 28 సీట్లు, నెల్లూరు జిల్లా-ముత్తుకూరు ఫిషరీ సైన్స్ కాలేజీలో 11 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీవీఎస్సీ అండ్ ఏహెచ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఇంటర్ స్థాయిలో ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థులందరూ తెలంగాణ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. బీఎస్సీ ఆనర్స్, బీటెక్, బీఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లలో చేరాలంటే అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. బీవీఎస్సీ అండ్ ఏహెచ్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/JKenkieలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

రాజ్‌తరుణ్ ఎపిసోడ్‌లో కొత్త ట్విస్ట్





రాజ్‌తరుణ్, లావణ్య, హీరోయిన్ మాల్వీ మల్హోత్రా ఎపిసోడ్ సోమవారం సరికొత్త మలుపు తిరిగింది. ఈ ఎపిసోడ్‌లోకి కొత్త పాత్ర ఎంటర్ అయింది. తన కుమారుణ్ని ట్రాప్ చేసి, మాల్వీ ఆస్తి కాజేసిందని ముంబై నిర్మాత యోగేశ్ తల్లి సంచలన ఆరోపణలు చేస్తూ ఓ వీడియో విడుదల చేశారు. యోగేశ్, మాల్వీ కాల్ లిస్ట్‌ను కూడా ఆమె బయట పెట్టారు. ఆమె వెల్లడించిన సమాచారం ప్రకారం యోగేశ్ ముంబైలో ఓ చిన్న నిర్మాత. తన చిత్రంలో నటించడానికి వచ్చిన మాల్వీతో ప్రేమలో పడ్డారు యోగేశ్. వీళ్లిద్దరూ రెండేళ్లు సహజీవనం కూడా చేశారు. ఆ తర్వాత ఏమైందో ఏమో, తనని పెళ్లి చేసుకోవడానికి యోగేశ్ నిరాకరించాడనీ, కత్తితో తనపై దాడి చేసి చంపడానికి ప్రయత్నించాడనీ ఆరోపిస్తూ మాల్వీ కేసు పెట్టడంతో యోగేశ్‌ను ముంబై పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాలుగేళ్లుగా మాల్వీ తమ కుటుంబాన్ని ఇబ్బంది పెడుతోందని, తప్పుడు కేసులు పెట్టి తన కుమారుడిని జైలుకి పంపించిందని యోగేశ్ తల్లి వెల్లడించారు. రాజ్‌తరుణ్, లావణ్య కేసులో మాల్వీ ఇన్‌వాల్వ్ అయిన విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్నాననీ, అందుకే మాల్వీ బండారం బయటపెట్టాలని వీడియో విడుదల చేస్తున్నాననీ, తన కొడుకు ఇంకా జైలులోనే ఉన్నాడనీ, మాల్వీ అతని కెరీర్‌ను సర్వనాశనం చేసిందని చెబుతూ కన్నీళ్లు పెట్టుకున్నారు యోగేశ్ తల్లి.



ఆ లోటు తీర్చేలా 'డార్లింగ్'

నాని

ప్రియదర్శి, నభానటేశ్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'డార్లింగ్'. 'వై దిస్ కొలవెరీ' అనేది ఉపశీర్షిక. అశ్విన్‌రామ్ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. సినిమా ఈ నెల 19న విడుదలవుతోన్న సందర్భంగా సోమవారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాని మాట్లాడుతూ "ఈ మధ్య కామెడీ చిత్రాలు తక్కువైపోయాయి. ఆ లోటు తీర్చేలా వచ్చే చిత్రమే 'డార్లింగ్'. ఈ సినిమా ఘనవిజయం సాధించాలి. చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్. త్వరలోనే జగదీశ్ అనే కొత్త డైరెక్టర్‌తో మా నిర్మాణ సంస్థలో కొత్త చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ఇందులో ప్రియదర్శినే హీరో" అని చెప్పారు. "ఈ సినిమా హిలేరియస్ ఎంటర్టైనర్. నాకు నటన పరంగా నానినే రోల్ మోడల్" అని ప్రియదర్శి అన్నారు. "కపుల్స్ మధ్య జరిగే సరదా సంఘటనల నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాకు అందరూ కనెక్ట్ అవుతారు" అని దర్శకుడు అశ్విన్‌రామ్ చెప్పారు. "ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకం ఉంది" అని నిర్మాత కె.నిరంజన్ రెడ్డి తెలిపారు.

మేడమ్ టుస్సాడ్స్‌లో రామ్‌చరణ్ విగ్రహం?



లండన్‌లో ఉన్న మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో మన హీరో రామ్‌చరణ్ మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారా? అవుననే అంటున్నాయి టాలీవుడ్ వర్గాలు. రామ్‌చరణ్ పాపులారిటీ, ఆయన ఫాలోయింగ్‌ను గమనించిన మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తన విగ్రహం తయారీలో సహకరించడం కోసం రామ్‌చరణ్ లండన్‌లోనే ఉన్నారు. ఈ విగ్రహానికి ఒక ప్రత్యేకత ఉంది. అదేమిటంటే.. రామ్‌చరణ్ ఫ్రెంచ్ బార్బెట్ జాతికి చెందిన ఓ కుక్క పిల్ల రైమ్‌ను పెంచుకుంటున్నారు. ఎక్కడికి వెళ్లినా, ఏ దేశం సందర్శించినా తమతో పాటు రైమ్‌ను తీసుకెళ్లడం రామ్‌చరణ్ దంపతులకు అలవాటు. అందుకే రైమ్‌ను ఎత్తుకుని ఉన్న రామ్‌చరణ్ మైనపు బొమ్మనే మేడమ్ టుస్సాడ్స్‌లో ఏర్పాటు చేయనున్నారని సమాచారం.

అందుకే ఆ పెళ్లికి వెళ్లలేదు

తాప్సీ



అపర కుబేరుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ వివాహం రాధికతో జరిగిన సంగతి విదితమే. అంగరంగ వైభవంగా జరిగిన ఈ వివాహ వేడుకలకు భారతీయ చిత్ర పరిశ్రమలోని ప్రముఖులందరూ హాజరయ్యారు. ఆడారు, పాడారు. నూతన దంపతులకు ఆశీస్సులు అందజేశారు. అయితే ఈ పెళ్లికి వివిధ కారణాల వల్ల హాజరు కాని సినీ ప్రముఖులు కూడా ఉన్నారు. వారిలో హీరోయిన్ తాప్సీ ఒకరు. తను ఆ పెళ్లికి ఎందుకు వెళ్లలేదో ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె వెల్లడిస్తూ ఆసక్తికరమైన వాఖ్యలు కూడా చేసింది. 'నాకు వాళ్లతో వ్యక్తిగత పరిచయం లేదు. నా ఉద్దేశంలో పెళ్లి అనేది అనుబంధాలతో కూడిన వేడుక. ఆతిథ్యం ఇచ్చే కుటుంబానికి, అతిథికి మధ్య ఏదో రకమైన అనుబంధం ఉండి తీరాలి. అటువంటి వివాహాలకే నేను హాజరవుతా. తెలియని వారి ఇంట జరిగే పెళ్లికి వెళ్లి ఇబ్బంది పడలేను' అని తాప్సీ చెప్పింది. ఏ విషయం గురించైనా నిర్మొహమాటంగా మాట్లాడడం మొదటినుంచీ తాప్సీకి అలవాటు. అందుకే అంబానీ ఇంట పెళ్లి గురించి కామెంట్ చేయడానికి ఆమె వెనుకాడలేదు.

థౌజండ్ వాలా టపాసులు



ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక సినిమా హిట్ అనిపించుకుంటే సరిపోదు.. కలెక్షన్లలో సునామీ సృష్టించి.. నిర్మాతలకు లాభాల పంట పండించాల్సిందే. వసూళ్ల పరంగా ఒకప్పుడు రూ.వంద కోట్ల కలెక్షన్స్ సాధించడమే అద్భుతమనిపించేది. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. పెరిగిన టికెట్ రేట్ల కారణంగా కలెక్షన్ల లెక్కలు మారిపోయాయి. రూ.వంద కోట్లు .. రూ.రెండు వందల కోట్లు.. రూ.మూడు వందల కోట్లు.. రూ..నాలుగు వందల కోట్లు.. రూ.ఐదొందల కోట్లు... ఇదీ లెక్క ఇప్పుడు. అలా పెరుగుతూ వచ్చిన కలెక్షన్ల లెక్కలకు తాజా టార్గెట్ రూ. వెయ్యి కోట్లు. తాజాగా 'కల్కి' చిత్రం రూ. వెయ్యి కోట్ల రికార్డును సాధించడంతో తెలుగు సినిమా సత్తా మరోసారి చాటిచెప్పినట్లయింది. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇంతవరకు రూ. వెయ్యికోట్లు వసూలు చేసిన చిత్రాల సంఖ్య ఏడైతే వాటిలో మూడు సినిమాలు మనవే కావడం గర్వంతో కాలర్ ఎగరెయ్యాల్సిన అంశమే.

'యుద్ధం.. యుద్ధం' అంటూ బరిలోకి దిగి బాక్సాఫీస్‌ను షేక్ చేశారు ఆమిర్ ఖాన్. ఆయన నటించిన 'దంగల్' చిత్రం 2016లో రిలీజై.. అప్పటివరకూ ఉన్న సినిమా రికార్డులను కోలుకోలేని దెబ్బ కొట్టింది. నితీశ్ తివారీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం.. గ్లోబల్ బాక్సాఫీస్ దగ్గర రూ.2వేలపై చిలుకు కలెక్షన్లను సాధించింది. ఈ సినిమా మల్లయోధుడు మహవీర్‌సింగ్ ఫోగట్, ఆయన కుమార్తెల జీవితాల్లోని సంఘటనల ఆధారంగా తెరకెక్కింది.


కలెక్షన్లలో 'మాహిష్మతీ సామ్రాజ్య' విజృంభన

దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో ప్రభాస్ నటించిన 'బాహుబలి'కి కొనసాగింపుగా వచ్చిందే 'బాహుబలి 2'. 2017లో రిలీజైన ఈ సినిమా తెలుగు చిత్ర పరిశ్రమ హద్దులు దాటి ప్రపంచవ్యాప్త హిట్‌గా నిలిచి.. అసలు సిసలు పాన్ ఇండియా సినిమా సక్సెస్ అంటే ఎలా ఉంటుందో అందరికీ రుచి చూపించింది. ఈ సినిమా వరల్డ్‌వైడ్‌గా రూ.1810 కోట్లు కలెక్షన్ల మార్క్ అందుకుంది.

'అసలు సిసలు మల్టీస్టారర్'

దర్శకధీరుడు రాజమౌళి రామ్‌చరణ్, జూనియర్ ఎన్టీఆర్‌తో చేసిన మ్యాజికల్ యాక్షన్ ఎంటర్టైనర్ 'ఆర్ఆర్ఆర్'. ఈ కల్పిత పీరియాడికల్ యాక్షన్ డ్రామాలోని పోరాటఘట్టాలు.. పాటలు చూసి పరదేశీయులు ఫిదా అయ్యారు. ఈ సినిమాతో రాజమౌళి సినిమాలకు గ్లోబల్ క్రేజ్ పీక్స్‌కు చేరింది. ఇందులోని 'నాటు నాటు ' పాటకు ఆస్కార్ వరించిన సంగతి తెలిసిందే. హాలీవుడ్ దిగ్గజ దర్శకులు జేమ్స్ కామెరూన్, రూసో బ్రదర్స్ ప్రశంసలు పొందిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.1400 కోట్లు వసూళ్లు చేసింది.





'రాకీ భాయ్' మానియా

యష్ నటించిన 'కేజీఎఫ్'తో కన్నడ ఇండస్ట్రీ వైపు దేశం మొత్తం చూసేలా చేసిన డైరెక్టర్ ప్రశాంత్ నీల్. ఆయన దర్శకత్వంలో ఈ చిత్రానికి కొనసాగింపుగా తెరకెక్కిన 'కేజీఎఫ్ 2'తో కన్నడ సినిమా స్థాయి గ్లోబల్ రేంజ్‌కు ఎదిగింది. యాక్షన్ ప్రియులకు అత్యంత చేరువైన ఈ సినిమా దాదాపు రూ.1300 కోట్లను కలెక్ట్ చేసింది.

'వింటేజ్ కింగ్ ఖాన్' ప్రభంజనం

వరుస ఫ్లాపుల్లో ఉన్న షారుక్ ఖాన్‌ను మళ్లీ హిట్ ట్రాక్‌లోకి ఎక్కించిన చిత్రం 'పఠాన్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.వెయ్యి కోట్లు పైచిలుకు కలెక్షన్లను రాబట్టింది. ఇందులో రా ఏజెంట్‌గా షారుక్, ఐఎస్ఐ ఏజెంట్ పాత్రలో నటించిన జాన్ అబ్రహామ్‌తో చేసిన పోరాటాలు సినిమాకే స్పెషల్ అట్రాక్షన్‌గా మారాయి.

'జవాన్' మ్యాజిక్

తమిళ దర్శకుడు అట్లీతో షారుక్ ఖాన్ చేసిన సినిమా 'జవాన్'. సమాజాన్ని దుర్మార్గుల బారి నుంచి కాపాడడానికి తండ్రిగా.. కొడుకుగా షారుక్ ఇందులో డ్యూయెల్ రోల్ పోషించారు. అత్యద్భుత పోరాట ఘట్టాలతో అందరినీ కట్టిపడేసిన ఈ చిత్రం దాదాపు రూ.1200 కోట్ల కలెక్షన్లు కొల్లగొట్టింది.

'కల్కి' హవా

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన విజువల్ వండర్ 'కల్కి 2898 ఏ.డీ'. జూన్‌లో విడుదలైన ఈ సినిమాలో పురాణాల్ని, సైన్స్ ఫిక్షన్‌ను మిళితం చేసి దర్శకుడు అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. ఇందులో అమితాబ్, ప్రభాస్ మధ్య వచ్చే పోరాట ఘట్టాలు.. కాంప్లెక్స్, కాశీ, శంభల ప్రాంతాల విజువల్స్, పతాక సన్నివేశాల్లో ప్రభాస్ కర్ణుడిగా కనిపించే దృశ్యం సినిమా విజయాన్ని మరో లెవెల్‌కు తీసుకెళ్లాయి. రిలీజైన 15 రోజులకే రూ.1000 కోట్ల కలెక్షన్లను అందుకుని.. మరిన్ని రికార్డులు నెలకొల్పే దిశగా దూసుకుపోతోంది.

ఓ మంచి సినిమా మీకు ఇవ్వబోతున్నా




'క' అనే ఒకే ఒక్క పదం టైటిల్‌తో హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న చిత్రం ట్రేడ్‌లో ఇప్పుడు ఆసక్తిగా మారింది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు సుజిత్, సందీప్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్నారు. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం త్వరలో తెలుగు సహా తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సోమవారం సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ 'మూడు 'క' లను నమ్ముకుని ఈ 'క' చిత్రం తీశాను. మొదటి క.. కథ. చాలా కథలు విని విభిన్నంగా ఉన్న ఈ చిత్రకథను ఎన్నుకున్నాం. రెండో క.. కిరణ్ అబ్బవరం., మూడో క.. కల. ఒక మంచి సినిమా తీసి పదిమందికి తోడుగా ఉండాలన్నది నా కల, అది ఈ సినిమాతో నెరవేరుతోంది. దర్శకులుగా పరిచయమవుతున్న సందీప్, సుజిత్ తొలి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకుంటారు' అని తెలిపారు.

'ఎటువంటి కథనైనా తెర పైకి తీసుకురావడానికి ధైర్యం కావాలి. కిరణ్ మాకు సపోర్ట్ ఇచ్చారు. మంచి టీమ్‌ను ఇచ్చారు. కొత్త డైరెక్టర్స్‌కు అలాంటి టీమ్ దొరకడం అదృష్టమే' అన్నారు దర్శకుల్లో ఒకరైన సుజిత్. మరో దర్శకుడు సందీప్ మాట్లాడుతూ 'ఎంతో రిసెర్చ్ చేసి, 80ల కాలం నాటి వస్తువులను సేకరించి, హై స్టాండర్డ్స్‌లో ఈ సినిమా తీశాం. ఫ్యామిలీ వాతావరణాన్ని క్రియేట్ చేసి మేం టెన్షన్ లేకుండా పని చేసే అవకాశాన్ని కిరణ్ కల్పించారు. 'క' అంటే కిరణ్ అబ్బవరం కాదు.. ఇందులో ఒక ప్రధాన పాత్ర ఉంది. అదేమిటో థియేటర్లలోనే చూడాలి' అన్నారు.

హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ' 'వీడి పని అయిపోయింది' అని ఎవరైనా అంటే నమ్మకండి. మన పని అయిందా లేదా అనేది మనకు మాత్రమే తెలుసు. అలాగే నా పని అయిపోయిందా లేదా అనేది నాకు తెలుస్తుంది. అలా అనిపించినప్పుడు సినిమాలు చేయను. 'క' సినిమా మొదలై ఏడాదిన్నర అయింది. ఒక మంచి సినిమా కోసం మేమంతా కష్టపడ్డాం. ఒక మంచి సినిమాను మళ్లీ మీకు ఇవ్వబోతున్నా. మీ ప్రేమను పొందడానికి ఎదురు చూస్తున్నా. 'క' ప్రొడక్షన్ వర్క్ అంతా రహస్య చూసుకుంది. సినిమా రీచ్ అయ్యాక మాట్లాడతా అని చెప్పింది. అందుకే ఇక్కడికి రాలేదు' అన్నారు.

నటుడు రక్షిత్ శెట్టిపై కేసు



కాపీరైట్ ఉల్లంఘించారనే ఆరోపణలతో శాండల్‌వుడ్ నటుడు రక్షిత్‌శెట్టిపై కేసు నమోదైంది. 'న్యాయ ఎల్లిదె..?', 'గాలి మాతు' అనే రెండు సినిమాల పాటలను అనుమతి లేకుండా ఆయన వినియోగించుకున్నారని ఎంఆర్‌టీ మ్యూజిక్ సంస్థ భాగస్వామి నవీన్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు బెంగళూరు యశ్వంతపుర పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. రక్షిత్‌శెట్టిని పోలీసులు విచారణకు పిలిచే అవకాశం ఉంది.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

పాత్రను ఇష్టపడి చేసిన సినిమా



బిగ్‌బాస్ ఫేమ్ రవికృష్ణ కీలక పాత్రలో నటించిన చిత్రం 'బర్త్‌డే బాయ్'. విస్కీ దర్శకత్వంలో ఐ.భరత్ నిర్మించారు. ఈ నెల 19న సినిమా విడుదలవుతోంది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా రవికృష్ణ మీడియాతో ముచ్చటించారు. "నాకు రియల్ లైఫ్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా తెరకెక్కే చిత్రాలంటే చాలా ఇష్టం. ఇందులో నా పాత్ర బాగా నచ్చి కథ విన్న వెంటనే ఒప్పేసుకున్నాను. ఇదొక కామెడీ డ్రామా. చిత్రంలోని ప్రతీ పాత్ర కూడా ఎంటర్టైన్ చేస్తుంది. ఎం.ఎస్ చదవడానికి విదేశాలకు వెళ్లిన ఐదుగురు చిన్ననాటి స్నేహితుల జీవితం చుట్టూ ఈ సినిమా కథ నడుస్తుంది. సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది." అని చెప్పారు.

నిర్వహణ లేక.. మరమ్మతుకు నోచుకోక

● పెండింగ్‌లో కోట్లాది రూపాయల ప్రతిపాదనలు ● ఇదీ బొబ్బిలి డివిజన్ పరిధిలో రోడ్ల దుస్థితి


గొల్లపల్లి వద్ద దమ్ముమడిలా మారిన రోడ్డు

బొబ్బిలి: బొబ్బిలి డివిజన్ పరిధిలో పలు గ్రామీణప్రాంత రోడ్లు అధ్వానంగా మారాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్వహణ, మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో అప్పట్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకునేవి. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీలు రోడ్ల దుస్థితిపై ఆందోళనలు నిర్వహించిన విషయం విదితమే. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్ల కోసం పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలన్నింటికీ గ్రీన్‌సిగ్నల్ ఇప్పించే బాధ్యతలను తీసుకొని తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని పలువురు వాహనచోదకులు కోరుతున్నారు. ఈ పనులకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందని ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు సుదీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో నిధులను విడుదల చేస్తుందని అధికారులు, ప్రజాప్రతినిధులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాగా గుంతల మయంగా ఉన్న రోడ్లన్నింటిని పూడ్చిపెట్టి ప్రజలకు సౌకర్యవంతంగా తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో త్వరలో శ్రీకారం చుడతామని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

ఇవీ మరమ్మతుకు పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలు..

● బొబ్బిలి-తెర్లాం రోడ్డుకు రూ. 10 కోట్లు ● ఉత్తరావల్లి జంక్షన్ నుంచి పాతబొబ్బిలి దగ్గర జిల్లా సరిహద్దు వరకు రూ. 10 కోట్లు ● పనుకువలస-బలిజిపేట-వంతరాం వయా కోమటిపల్లి రోడ్డుకు రూ. 3 కోట్లు ● కోమటిపల్లి రోడ్డుకు రూ. 4 కోట్లు ● బొబ్బిలి-పిరిడి రోడ్డుకు రూ. 2.5 కోట్లు ● నెమలాం-ఉద్దవోలు-గళావల్లి రోడ్డుకు రూ.3.20 కోట్లు ● బూశాయవలస-కోటశిర్లాం రోడ్డుకు రూ.1.50 కోట్లు ● గంగాడ-కోసంగిపాడు రోడ్డుకు రూ. 1.50 కోట్లు ● పక్కి జంక్షన్ నుంచి బర్లి-పెదపెంకి రోడ్డుకు రూ. రూ. 60 లక్షలు ● డొంకినవలస రైల్వే ఫీడరు రోడ్డుకు రూ. 40లక్షలు చొప్పున ప్రతిపాదించిన రోడ్ల పనులన్నీ నిధుల మంజూరు కోసం నిరీక్షిస్తున్నాయి.

ప్లాన్ గ్రాంట్‌లో ప్రతిపాదించిన రోడ్ల వివరాలు..

● సాలూరు-మక్కువ రోడ్డు ఏడు కిలోమీటర్ల దూరం విస్తరణ కోసం రూ. 15 కోట్లు ● బొబ్బిలి పట్టణ పరిధిలో రేజేరు-తెర్లాం రోడ్డులో 3.6 కిలోమీటర్ల దూరం నాలుగు లైన్ల విస్తరణ కోసం రూ.30 కోట్లు ● బొబ్బిలి-పెంట- రంగరాయపురం 12 కిలోమీటర్ల రోడ్డుకు రూ. 15 కోట్లు ● పినపెంకి-ఆకులకట్ట రెండు కిలోమీటర్ల రోడ్డుకు రూ. 15 కోట్లు చొప్పున అధికారులు ప్రతిపాదించారు.

పొలంలోనే కుప్పకూలి రైతు మృతి

వీరఘట్టం: చిట్టిపూడివలసలో సోమవారం వ్యవసాయపనులు చేస్తుండగా రైతు జక్కు కృష్ణమూర్తి(65) కన్నుమూశారు. గ్రామ సమీపంలోని మరొక రైతు పొలంలో వ్యవసాయ పనులు చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. సమీపంలోని రైతులు అతని వద్దకు వెళ్లి చూసేసరికి మరణించారని గ్రామస్థులు తెలిపారు. ఈయన గుండెపోటుతో మరణించి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. ఆయనకు వివాహితులైన ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండేళ్ల కిందట భార్య మరణించింది.

పాము కాటుకు మహిళ..

గంట్యాడ: మండలంలోని పెణసాంగ్రామానికి చెందిన కడుపుట్ల రమణమ్మ(40) పాము కాటుకు గురై సోమవారం మృతిచెందింది. దీనికి సంబంధించి ఎస్ఐ సురేంద్ర నాయుడు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 28న పొలంలోని పనులు చేస్తుండగా ఆమె పాముకాటు గురయ్యింది. కుటుంబీకులు వెంటనే చికిత్సకోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖపట్టణం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భూ కబ్జాలకు పాల్పడితే చర్యలు: ఏఎస్పీ


ఫిర్యాదుదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఆష్మాపరహీన్

విజయనగరం క్రైం: జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో భూకబ్జాలు, బెదిరింపులకు పాల్పడేవారిపై విచారణ చేపట్టి చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని అదనపు ఎస్పీ ఆష్మాపరహీన్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి 29 ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులు స్వీకరించిన ఏఎస్పీ తక్షణమే పరిష్కరించి తీసుకున్న చర్యలు నివేదించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ గోవిందరావు, సీఐలు విజయనాథ్, నర్సింహమూర్తి, ఎస్ఐ గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలి

● ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పుణ్యవతి



రామభద్రపురం: మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రామభద్రపురం: పసికందుపై అత్యాచారయత్నం చేసిన మానవమృగం ఎరకన్నదొరను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పుణ్యవతి డిమాండ్ చేశారు. సోమవారం గాంధీబొమ్మ జంక్షన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూమండల కార్యదర్శి శ్రీనివాసరావు, అంగన్ వాడీ నాయకులు కూనిశెట్టి సత్యవతి, రాధ, పండు లక్ష్మీ, రమణి, రమా పాల్గొన్నారు.

●**విజయనగరం దాసన్నపేట:** జిల్లాలోని రామభద్రపురం ప్రాంతంలో పసిపాపపై అత్యాచార ఘటన బాధాకరమని డీసీఎంఎస్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన అన్నారు. సోమవారం ఆమె నివాసంలో మాట్లాడుతూ జిల్లాలో ఇటువంటి సంఘటనలు జరగడం దారుణమన్నారు.

●**రాజాం:** రామభద్రపురం మండలంలో చిన్నారిపై అత్యాచారం చేసిన వ్యక్తిని శిక్షించాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటువంటి మానవ మృగానికి నడిరోడ్డుపై ఉరికంబం ఎక్కించినా తప్పులేదని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి మానవ మృగాలు పెట్రేగిపోకుండా ఉండడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కఠిన చట్టాలు తీసుకురావాలని కోరారు.

క్రీడా రంగంలో రాణించాలి: డీఈవో

విజయనగరందాసన్నపేట: విద్యార్థులు విద్యతోపాటు క్రీడారంగంలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ కోరారు. సోమవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో సౌత్‌ఇండియా కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరాటేలో జిల్లా విద్యార్థులు పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పెంకి అశ్విని, హుమన్ రైట్స్ ప్రతినిధి పాండ్రంకి సంతోష్‌కుమార్, ఎం.అప్పారావు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

● గోపాలరాయుడిపేట పంచాయతీ గిరిజనుల వినతి


బొబ్బిలి: తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన గిరిజనులు

బొబ్బిలి: తమగ్రామాలకు కనీససౌకర్యాలు కల్పించాలని మండలంలోని గోపాలరాయుడిపేట పంచాయతీపరిధిలోని గిరిజనగ్రామాల ప్రజలు ఎం.రాజుబాబు, మోహన్, బిహాను తదితరులు కోరారు. సోమవారం వారంతా బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కృపావలస, చినఅక్కేనవలస, రియాన్‌వలస, చియాన్, రామన్నవలసలో 2000నుంచి నివాసముంటున్నామని, ఇంతవరకు తమకు విద్యుత్, తాగునీరు, రోడ్లు వంటి సౌకర్యాలు కల్పించలేదని వాపోయారు.

తారు రోడ్డును తొలగించాలి

శృంగవరపుకోట రూరల్: మండలంలోని ముషిడిపల్లి పంచాయతీలో గల సర్వే నెంబరు 99-01 జగన్నాథబందలో విజయనగరానికి చెందిన కొందరు లేఅవుట్‌కు వేసిన తారురోడ్డును తొలగించాలని ఉపసర్పంచ్ మేడపురెడ్డి గణేష్, పలువురు వార్డు సభ్యులు కోరారు.ఈ మేరకు వారంతా సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా గణేష్ మాట్లాడుతూ జగన్నాథబందలో ఆక్రమించి, వాల్టా చట్టం అతిక్రమించి రోడ్డువేయడంపై గతప్రభుత్వంలో పలుసార్లు ఫిర్యాదుచేసినా స్పందించలేదని తెలిపారు. అప్పటి అధికారపార్టీకి చెందిన వారు చర్యలు తీసుకోలేదని, ప్రస్తుతం అధికారంలోఉన్న కూటమి ప్రభుత్వం చెరువును రక్షించి ఆక్రమణలు తొలగించాలని కోరారు. ఆక్రమించిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

జేఎస్ఎల్ కర్మాగారంపై చర్యలు తీసుకోవాలి

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీలోగల జిందాల్‌నగర్‌లో ఉన్న జేఎస్ఎల్ కర్మాగారం 60 రోజులు దాటుతున్నా తమ సమస్య పరిష్కరించలేదని, కర్మాగారంలో లాకౌట్‌ను ఎత్తి వేసేందుకు ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరారు.ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు.ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ జేఎస్ఎల్ కర్మాగారంలో 57 మంది ఎంప్లాయీస్ కార్మికులు, 264 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని యాజమాన్యం కార్మికులు, రాష్ట్రప్రభుత్వానికి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా లాకౌట్ విధించిందని చెప్పారు. యాజమాన్య వైఖరి వల్ల కార్మికులంతా ఉపాధికోల్పోయి, వీధిన పడాలసి వచ్చిందని, జేఎస్ఎల్ యాజమాన్యంపైప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

సామాజిక తనిఖీని పక్కాగా చేపట్టాలి: ఎస్ఆర్పీ

రామభద్రపురం: ఉపాధిహామీ పథకం కింద త్వరలో జరగనున్న సామాజిక తనిఖీని పక్కాగా చేపట్టాలని స్టేట్ రిసోర్స్‌పర్సన్ కె.మన్మథరావు సూచించారు. సోమవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఈఏడాది మార్చి 31వరకు ఉపాధిహామీ పథకం, పంచాయతీరాజ్, హౌసింగ్, పెన్షన్లు సంబంధించి ఆడిట్ నిర్వహిస్తున్నామని, సుమారు రూ.16.98కోట్లు పనులకు ఈఆడిట్ నిర్వహించాల్సిఉందని తెలిపారు. గ్రామాల్లో తనిఖీలకు వస్తున్న డీఆర్పీలకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో గొలగాని త్రినాథరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకు పరిష్కారం చూపండి

● 23 నుంచి ఆధార్ అప్‌డేషన్ శిబిరాలు : కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్: ప్రజల నుంచి వచ్చిన ప్రతిసమస్యకు పరిష్కారం చూపాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు.ఆ సమస్యలను ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో వారంరోజుల్లో పరిష్కరించాలని స్పష్టంచేశారు. మండల స్థాయిలో పరిష్కరించదగిన వినతులను అక్కడే పరిష్కరించాలని కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలో ప్రజల వినతులు పరిష్కారంపై కలెక్టర్ మండల, జిల్లా స్థాయి అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ప్రజల నుంచి 188 వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ఏ ఒక్క మండలంలోనూ అక్రమ మైనింగ్ తవ్వకాలు జరుగుతున్న మాట వినిపించకూడదని, వాటిపై తహసీల్దార్లు గట్టి నిఘా ఉంచాలని చెప్పారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా వినతులు పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆలస్యంగా హాజరయ్యే అధికారులపై కఠినంగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ఆధార్‌లో ఆయా వ్యక్తులు తాజా సమాచారంతో అప్‌డేషన్ కోసం గ్రామ, వార్డు సచివాలయాలు సిబ్బంది ఆధ్వర్యంలోఈనెల 23నుంచి 27వరకూ ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు చెప్పారు. దీనిపై విద్యార్థులు, ఆయా వర్గాల ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు.కాగా ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తనిధిలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం నా ఊరు విజయనగరం సంస్థ అధ్యక్షురాలు గుమ్మ లూరు విశాలక్ష్మి రూ.35 వేలు కలెక్టరు అంబేద్కర్‌కు సోమవారం అందజేశారు.


కలెక్టర్ వినతిపత్రం అందజేస్తున్న విజయనగరం టీడీపీ నాయకులు

సచివాలయాలను ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలి

విజయనగరం పట్టణంలో ఉన్న వార్డు సచివాలయాలను ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని టీడీపీ నాయకులు కోరారు.ఈ మేరకు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విన్నవించారు. సుమారు 53 కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండడం వల్ల వాటి అద్దె నగర పాలక సంస్థ సాధారణ నిధులు నుంచి చెల్లిస్తున్నట్లు తెలుస్తోందని చెప్పారు. వెంటనే సచివాలయాలను ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాద్ కోరారు.

మెరుగైన క్రీడాకారులు తయారుకావాలి

● శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


ఎస్.కోటలో ఇండోర్‌స్టేడియం ప్రారంభిస్తున్న లలితకుమారి

శృంగవరపుకోట: మెరుగైన క్రీడాకారులు తయారుకావాలని శృంగ వరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆకాంక్షించారు.సోమవారం శృంగవరపుకోటలోనిర్మించిన ఇండోర్ స్టేడియం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, కొణదం మల్లేశ్వరరావు, నానిగిరి రమణాజీ, ఇందుకూరి శ్రీనిరాజు పాల్గొన్నారు.

●విశాఖలోని కేజీహెచ్‌లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే లలిత కుమారి పాల్గొని వైద్యసేవలపై సలహాలిచ్చారు.

యంత్రాలతో చేపట్టిన పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న బేబీనాయన

బాడంగి: గోపీనాథ్ పట్నాయక్ చెరువులో పనులను ఎమ్మెల్యే బేబీనాయన సోమవారం పరిశీలించారు. ఇటీవల ఎమ్మెల్యే బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడులకు గోపీనాథ్ పట్నాయక్ చెరువుకు నీరు పోయేమార్గం లేదని రైతులు విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే, రైల్వే అధికారులు చెరువు ఆయకట్టుకు నీరు పోయేందుకు యంత్రాలతో పనులు ప్రారంభించగా ఎమ్మెల్యే సోమవారం ఆ పనులను పరిశీలించారు. పెదపల్లి, తెంటువలస, పింద్రంగివలస, వీరసాగరం, డొంకినవలస రైతులు హర్షం వ్యక్తం చేశారు.

మెకానిక్ ఈశ్వరరావుకు పురస్కారం


ఈశ్వరరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే

విజయనగరం దాసన్నపేట: నగరానికి చెందిన బుల్లెట్ మెకానిక్ గొలుసు ఈశ్వరరావు తిలక్ పురస్కారానికి ఎంపికయ్యారు. స్థానిక ఉడాకాలనీ ఫంక్షన్ హాల్లో కేఎస్ తిలక్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని ఈశ్వరరావుకు ప్రదానంచేసింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు కందాల అశోక్, నాలుగెస్సల రాజు, ఎర్రినాయుడు, విజయరామకృష్ణ, మాజీ కౌన్సిలర్ కొర్నాన రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారానికి స్వస్తి పలకండి

● జామి మండల టీడీపీ అధ్యక్షుడు పోలిపర్తి స్వామినాయుడు

జామి: ఇక నుంచైనా తప్పుడు ప్రచారానికి స్వస్తిపలకాలని జామి మండల టీడీపీ అధ్యక్షుడు పోలిపర్తి స్వామినాయుడు కోరారు. సోమవారం జామిలో ఏర్పా టుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లోట్లపల్లిలో ఇటీవల భీమసింగి చక్కెర కర్మాగారం గురించి మంత్రి శ్రీనివాస్‌చేసిన వ్యాఖ్యలను కొందరు తప్పుడు ప్రచారం చేయడం సరికాదని హితవుపలికారు. కర్మాగారం మూసేస్తామని మంత్రి ఎక్కడ పేర్కొనలేదని, చక్కెర కర్మాగారాల ప్రస్తుత పరిస్థితి చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో రమణ, పైడిరాజు, సూర్యారావు,సన్యాసినాయుడు పాల్గొన్నారు.

సుగర్స్‌పై మంత్రి వ్యాఖ్యలు సిగ్గుచేటు

భీమసింగి చక్కెర కర్మాగారం మూసేస్తామని పరోక్షంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వ్యాఖ్యలు సిగ్గుచేటని, నాటి ప్రభుత్వంలో మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పిన మాటలనే నేడుకూటమి ప్రభుత్వం అనుసరించేలా కనిపించడం మంత్రి వ్యాఖ్యలు బలం చేకురుస్తున్నాయని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, చల్లాజగన్ తెలిపారు. సోమవారం జామిలో వారు మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం మూసేసిన ఫ్యాక్టరీను తెరిపిస్తామని యువగళంలో చెప్పిన ప్రస్తుత మంత్రి నారా లోకేష్ మాటలు నీటమూటల అని ప్రశ్నించారు.

ప్రత్యామ్నాయ కర్మాగారం ఏర్పాటుచేయాలి

జామి: భీమసింగి చక్కెర కర్మాగారం స్థానంలో వేరే కర్మాగారం ఏర్పాటుచేస్తామన్నసంకేతాలను ప్రభుత్వంఇస్తోందని,ఈప్రక్రియను వేగవంతంచేసి ప్రత్యామ్నాయ కర్మాగారం ఏర్పాటుచేసి రైతులు, కార్మికులను ఆదుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు.ఈ మేరకు సోమవారం ఆయన కర్మాగార ఎండీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మండలంలోని పర్యటించిన మంత్రి శ్రీనివాస్ రాష్ట్రంలో చక్కెర పరిశ్రమలకు మనుగడ లేదని ప్రకటించడంతో పాటు ప్రత్యామ్నాయ పరిశ్రమలు ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారని తెలిపారు. కార్యక్రమంలో జాగరపు ఈశ్వరప్రసాద్, గొర్రిపాటి శ్రీనువాస్‌సిరికి అప్పారావు పాలొల్గన్నారు.

రైతులకు మేలు చేయండి


అచ్చెన్నాయుడును కలిసిన వ్యవసాయశాఖాధికారులు

బొబ్బిలి: రైతులకు ఈనెల 23 నుంచి నిర్వహించనున్న పొలం పిలుస్తుంది కార్యక్రమంలో బాగంగా మేలు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారని ఏడీ శ్యామ్‌సుందర్ తెలిపారు. ఈ మేరకు అయన్ను జిల్లాకు చెందిన వ్యవసాయశాఖాధికారులు సోమవారం శ్రీకాకుళం జిల్లాలో ఆయన స్వగ్రామంలో కలిశారు. బొబ్బిలి వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏడీ మజ్జి శ్యామ్‌సుందర్, ప్రకాశ్, మడక సూరి నాయకత్వంలో కలిశారు.

సెల్‌టవర్ తొలగించాలి

● కొండచాకరాపల్లిలో గ్రామస్థుల నిరసన


నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

వంగర: మండలంలోని కొండచాకరాపల్లిలో నిర్మించిన సెల్‌టవర్ తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.ఈమేరకు సోమవారం గ్రామంలో నిరసనతెలిపారు. జనావాసాల్లో సెల్‌టవర్ ఏర్పాటుచేయడంతో సెల్ రేడియేషన్ వల్ల క్యాన్సర్, శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయని వాపోయారు. ఇప్పటికే నిర్మించిన సెల్‌టవర్‌కు 5జీ సేవలు పునరుద్ధరించేందుకు వచ్చిన సిబ్బంది వెనక్కి వెళ్లాలని కోరారు. లేకపోతే తీవ్రపరిణామాలు చోటుచేసుకుంటామని గ్రామస్థులు హెచ్చరించారు.వచ్చిన సిబ్బంది వెనుతిరగడంతో గ్రామస్థులు శాంతించారు.

విశాఖ-అరకు రోడ్డు వెడల్పు తగ్గించాలి

కలెక్టరేట్: విశాఖ నుంచి పెందుర్తి, కొత్తవలస, ఎల్.కోట, వేపాడ, ఎస్‌కోట మండలాల నుంచి అరకు వరకు విస్తరించనున్న రోడ్డు వెడల్పు తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ నాయకులు దేగల అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోడ్డుకు అనుకునిఉన్న రైతులు,ప్రజలు అభిప్రాయాలు తీసుకోకుండా విస్తరిస్తున్నారని ఆరోపించారు. ల్యాండ్ కన్వర్షన్ చేసుకున్నవారికి, చేసుకొని వారికి ప్రభుత్వ కన్వర్షన్ ప్రకారం పరిహారం అందజేయాలని కోరారు.

డిపాజిట్లు వెంటనే చెల్లించాలి

సహారా ఖాతాదారులకు ,ఏజెంట్లుకు న్యాయం చేసి, డిపాజిట్లు చెల్లించాలని కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఖాతాదారుల డిపాజిట్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్‌చేశారు.పలువురు ఖాతాదారులు నిరసనచేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వాపోయారు.కార్యక్రమంలోని ఏజెంట్లు, డిపాజిట్‌దారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నాచేస్తున్న రైతులు

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

రాజాం: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసు కోవాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్తసంపద కేంద్రాలకు చెత్త తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

113 మలేరియా హైరిస్క్ గ్రామాల గుర్తింపు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 113 మలేరియా హైరిస్క్ గ్రామాలను అధికారులు గురించారు. జిల్లాలో మలేరియా నివారణకు చర్యలు చేపట్టారు. ఇటీవల జడ్పీ సమావేశంలో వ్యాధులపై సభ్యులు నిలదీయడంతో నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.ఫైలేరియాకు సంబంధించి 68 గ్రామాలను గుర్తించారు. వీటిలో ఎక్కువ గిరిజన ప్రాంతాలు ఉన్నాయి. రామభద్రాపురం మండలంలోని అరికతోట పీహెచ్‌సీ పరిధిలోని కొన్నిగ్రామాలు, మెంటాడ, చల్లపేట, ఎస్.కోట నియోజవర్గంలోని కొట్టాంలో ఏటా ఎక్కువమంది మలేరియా బారిన పడుతున్నట్లు వైద్య ఆరోగ్యాశాఖ అధికారులు చెబుతున్నారు. పారిశుధ్యలోపం తదితర కారణాలతో ఎక్కువ సంఖ్యలో మలేరియా, ఫైలేరియా వ్యాధుల బారినపడుతున్నారు.ఈనేపథ్యంలో దోమల నివారణకు కావల్సిన గంబూషియా చేపలకోసం రూ.32 వేలు అడ్వాన్స్ కూడా ఇచ్చినట్లు డీఎంహెచ్‌వో భాస్కరరావు చేప్పారు. కాగా జులై, ఆగస్టులో ఎక్కువ సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉండడంతో సచివాలయ సిబ్బందికి గ్రామాల్లో కాలువలు, గుంతలు, కళ్లాలు, నీరు నిల్వలు ఉన్నచోట దోమల నివారణ మందును పిచికారీ చేయాలని కోరినట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేస్తున్నట్లు చెప్పారు.

మహిళలపై వేధింపులను నిరోధించాలి

● బొబ్బిలి ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ


మాట్లాడుతున్న సాయిశ్రీ

బొబ్బిలి: పనిప్రదేశంలో మహిళలపై లైంగికవేధింపులు నిరోధించాలని బొబ్బిలి ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ కోరారు. సోమవారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో లైంగికవేధింపుల నిరోధకచట్టం-2013పై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్గత కమిటీలుప్రతీచోటా ఉండాలని తెలిపారు. వేధింపులకు గురైన వారు నెలలోగా అంతర్గత కమిటీలకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనరు లాలం రామలక్ష్మి, ఐసీడీఎస్ పీవోలు జె.విజయలక్ష్మి, కె.రాజ్యలక్ష్మి, నాగమణి, డివిజన్ పరిధిలో గల మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏపీఎంలు, ఎస్ఐలు, ఏఈలు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు మెరుగుపరుస్తాం

● కలెక్టర్ అంబేడ్కర్

రాజాం: జిల్లాలోఆర్టీసీ ప్రజా రవాణా సర్వీసులు మెరుగుపరుస్తున్నట్లు కలెక్టర్ అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో పల్లెకు చేరని ప్రగతి రథచక్రాలు శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో స్పందించారు. విజయనగరం డిపో నుంచి జిల్లా వ్యాప్తంగా 75 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదాపు 250 గ్రామీణ సర్వీసులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. రోడ్లు సౌకర్యం ఉన్న ప్రతి గ్రామానికి ఆర్టీసీ పల్లెవెలుగులు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రజా రవాణాతో పాటు ఆర్టీసీ కార్గో సర్వీసులు సైతంనడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ సేవలపై ఎప్పటికప్పుడు ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తెలుసుకుంటున్నట్లు తెలిపారు,

సూక్ష్మ సేద్యానికి సంపూర్ణ సహకారం

జిల్లాలో సూక్ష్మ సేద్యానికి అన్ని విధాలా సహకరిస్తున్నట్లు జిల్లా పౌర సంబంధాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు, ఆంధ్రజ్యోతిలో ఈనెల పదోతేదీన సూక్ష్మసేద్యం నిర్వీర్యం శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో సూక్ష్మసేద్యానికి అన్ని విధాల సహకారించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో, కొత్త మార్గదర్శకాలు రావాల్సిఉందని పేర్కొన్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం హయాంలో సూక్ష్మసేద్యానికి రాయితీలతోపాటు సౌకర్యం అందించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం రైతులకు మరిన్ని రాయితీలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కొద్దిరోజుల్లో దీనికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదలవుతాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి రైతుకు సూక్ష్మసేద్యం పథకం అందజేస్తామని తెలిపారు.

రేపు నారాయణ తీర్థ జయంతి

విజయనగరం రూరల్: విజయనగరంలోని మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ సంస్థ 679వ కార్యక్రమంలో బాగంగా బుధవారం నారాయణ తీర్థ జయంతి నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు డి.సర్వేశ్వరరావు, మండపాక రవిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కాకినాడకు చెందిన కళాకారుడు ఎల్.శ్రీనివాస్ బృందం నామ సంకీర్తనలు ఆలపిస్తుందని పేర్కొన్నారు.

18 నుంచి జనసేన సభ్యత్వ నమోదు

బొబ్బిలి: జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 18 నుంచి ప్రారంభమవుతుందని ఆ పార్టీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి తెలిపారు. సోమవారం బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడుతూ పార్టీ క్రియాశీల సభ్యత్వం పొందిన వారందరికీ బాధ్యతాయుతమైనకర్తవ్యాలు అప్పగిస్తారని తెలిపారు. జనసేన భావజాలానికి ఆకర్షితులై మద్దతు పలికేవారంతా క్రియాశీల సభ్యత్వాలను స్వీకరించాలని కోరారు.

కొత్తవలసలో కంటి పరీక్షలు

కొత్తవలస: కొత్తవలసలోని రాష్ట్ర పింఛన్‌దారుల సంఘం భవనంలో రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబాలు, పదవీవిరమణ చేసి పింఛన్‌దారులు వారి కుటుంబాలకు కంటి పరీక్షలను ఉచితంగా విజయనగరానికి చెందిన వేంకటేశ్వర పుష్పగిరి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది హాజరుకాగా 17 మందికి కంటి ఆపరేషన్లకు అర్హులుగా గుర్తించారు. వీరికి విజయనగరంలో పుష్పగిరి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయనున్నట్లు పింఛన్ దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు తెలిపారు.

పాల సంఘం అధ్యక్షుడిగా ఈశ్వరరావు

వేపాడ: మండలంలోని బల్లంకి విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్ష ఎన్నికకు సంబంధించి సోమవారం డెయిరీ యాజమాన్యం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామానికి చెందిన దేగల ఈశ్వరరావు విజేతగా నిలిచారు. పాల సంఘం అధ్యక్ష పదవికోసం టీడీపీ నుంచి ఈశ్వరరావు, వైసీపీ నుంచి బొడ్డు శ్రీనివాసరావు పోటీ పడ్డారు. ఈ మేరకు ఈశ్వరరావుకు 77 మంది, శ్రీనివాసరావుకు 71 మందిపాల ఉత్పత్తిదారులు మద్దత్తు తెలిపారు. ఆరు ఓట్ల మెజార్టీతో పాల సంఘం అధ్యక్షుడిగా దేగల ఈశ్వరరావు విజయం సాదించినట్లు డెయిరీ అధికారులు ప్రకటించారు. ముందస్తు ఒప్పందం ప్రకారం రెండు వర్గాలు చెరో నలుగురు డైరెక్టర్లు చొప్పున ఎంపిక చేసి కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కాగా వల్లంపూడి ఎస్ఐ రాజేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎస్.కోటలో ఆశీలు వేలం పాట

శృంగవరపుకోట: శృంగవరపుకోట పంచాయతీ పరిధిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు రోజు వారీగా కూలీ అందించేందుకు సోమవారం నిర్వహించిన వేలం పాటలో కాంట్రాక్టరు వాకాడ రమణ రూ.350కు పాడారు. ఆయనొక్కరే టెండర్ వేయడం పంచాయతీ అధికారులు ఆయనకు ఖరారుచేశారు. గత ఏడాది రోజువారి పారిశుధ్య కార్మికులకు రూ. 290 చెల్లించేవారు. ఏడాది అదనంగా రూ.60 పెరగనుంది. వీటితో పాటు పంచాయతీ పరిధిలోని వివిధ రకాల దుకాణాల నుంచి ఆశీలు వసూలు చేసేందుకు వేలం పాట వేశారు. దీన్ని ప్రతి సారి పాడే సరిపల్లి రామకృష్ణ దక్కించుకున్నారు. కార్య క్రమంలో సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, కార్యనిర్వాహక కార్యదర్శి వీవీ అనురాధ పాల్గొన్నారు.

నోడల్ అధికారుల నియామకం

కలెక్టరేట్: జిల్లాలోని 27 మండలాలకు, మునిసిపాలిటీలకు నోడల్ అధికారులకు నియమిస్తూ కలెక్టర్ అంబేద్కర్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ నోడల్ అధికారులు మండల, మునిసిపాలిటీల్లో పర్యటించి సమస్యలను తెలుసుకుని మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి కలెక్టరుకు నివేదికలు అందజేయనున్నారు.

రెండు బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు

పార్వతీపురంటౌన్: వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురం మండలం వెంకంపేటకు చెందిన ఎస్.ఉపేంద్ర, వైకేఎం కాలనీకి చెందిన స్నేహితుడు బి.శ్రీధర్‌తో సోమవారం వెంకంపేట వైపు బైక్‌పై వెళ్తున్నాడు. పెదబొండపల్లి గ్రామానికి చెందిన బి.అజయ్ తన బైక్‌పై పార్వతీపురం వస్తున్నాడు. వెంకంపేట గోలీలు సమీపంలోని వాటర్ ప్లాంట్ వద్ద రెండు బైక్‌లు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులకు జిల్లా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఔట్‌పోస్టు పోలీసులు తెలిపారు.

బాలికపై అఘాయిత్యం ఘటన..
నిందితుడిపై పోక్సో కేసు

సీతంపేట: మండలానికి చెందిన ఓ బాలికకు మాయమాటలు చెప్పి అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జగదీష్ నాయుడు సోమవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 12న మధ్యాహ్నం బాలిక (17) అదృశ్యమైనట్టు తన అక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు. ఆ తర్వాత బాలిక సీతంపేట పోలీస్ స్టేషన్‌కు స్వయంగా వచ్చి.. తనకు హైదరాబాద్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం గచ్చలవలస గ్రామానికి చెందిన వ్యక్తి మాయ మాటలు చెప్పి.. విశాఖపట్నం తీసుకెళ్లాడని ఎస్ఐకి వివరించింది. అక్కడ ఒక గదిలో పెట్టి పలు దఫాలుగా అత్యాచారానికి పాల్పడినట్టు తెలిపింది. తన చేతులు కట్టి గాయపరిచినట్టు బాలిక వివరించిందని, దీనిపై విచారణ చేసి పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు. పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్టు తెలిపారు.

సారా స్వాధీనం

మక్కువ: ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమంగా ఐదు లీటర్ల సారా తరలిస్తున్న దత్తిరాజేరు మండలానికి చెందిన అలజంగి సూరిబాబును మండలంలోని మార్కొండపుట్టి సమీపంలో సోమవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ పి.నరసింహమూర్తి సోమవారం తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతో పాటు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

వసూళ్లు వాస్తవమైతే విధుల నుంచి తొలగిస్తాం

● ఐసీడీఎస్ పీడీ రాణి

సాలూరు: అంగన్‌వాడీ కార్యకర్త బలగ రాధ సహచర కార్యకర్తల నుంచి ప్రతి నెలా డబ్బులు వసూలు చేయడం వాస్తవమైతే విధుల నుంచి పూర్తిగా తొలగిస్తామని ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్.రాణి స్పష్టం చేశారు. పట్టణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి సోమవారం వచ్చిన ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కథనాలతో బలగ రాధపై విచారణకు తాను వచ్చినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తూ స్ఫూర్తి మహిళా మండలి(ఎన్‌జీవో)ని నడపటం సరికాదని అన్నారు. ప్రతి కార్యకర్తను విచారణ చేసి వారి నుంచి వాస్తవాలను రాబడతాన ని చెప్పారు. కార్యకర్తగా ఉంటూ సెటిల్‌మెంట్లు, దందాలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. రెండో శనివారం తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రం తెరిచి ఉంచాలని.. అలా చేయకపోయినా చర్యలు తప్పవని అన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళతామని స్పష్టం చేశారు. నేరం రుజువైతే తక్షణం విధుల నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. ఆమెతో పాటు సీడీపీవో సత్యవతి ఉన్నారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

పార్వతీపురంటౌన్: సహారా ఇండియా ఖాతాదారులు, ఏజెంట్లకు బకాయి పడ్డ సొమ్మును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించకపోతే దశల వారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకులు వేణు, జీవీ రమణ, మన్మథరావు తెలిపారు. సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు సహారా ఏజెంట్లు, ఖాతాదారులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. దేశవ్యాప్తంగా కొట్లాది మంది పేద, మధ్య తరగతి ప్రజలు, ఏజెంట్లకు బకాయి సొమ్ము అందజేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

పెత్తందారులను అరెస్టు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న శివ్వాం గ్రామ దళితులు

పార్వతీపురంటౌన్: గరుగుబిల్లి మండలం శివ్వాం గ్రామ దళితుల భూములను సాగు చేస్తూ వారిపైనే దాడి చేసిన ఆ గ్రామ పెత్తందారులను అరెస్టు చేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు, గిరిజనులు, పేదలు సాగు చేస్తున్న భూములను పెత్తందారులు సాగు చేస్తుండడం బాధాకరమన్నారు. శివ్వాం గ్రామంలో గత కొన్నేళ్లుగా దళితులు సాగుచేసుకుంటున్న 22 ఎకరాల 80 సెంట్ల భూమిని ఆ గ్రామంలోని పెత్తందారులు తప్పుడు తోవలో లొక్కొని, సాగు చేస్తూ.. వారిపైనే దౌర్జన్యం చేస్తుండడం విచారకరమన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపిన పోలీసు అధికారులు ఇప్పటివరకు ఒక్క పెత్తందారుడిని అరెస్టు చేయకపోవడం విచారకరమన్నారు. దళితుల భూములు అప్పగించకపోతే ఉద్యమ, పోరాటాలను ఉధృతం చేస్తామని కృష్ణమూర్తి హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి కె.గంగునాయుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ విధానం సరికాదు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జీపీఎస్ విధానం సరైనది కాదని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. విజయవాడ స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో జరిగిన రాష్ట్ర కార్య నిర్వాహక వర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో నెంబరు 117ను రద్దు చేసి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని, నూతన పీఆర్సీ అమలుకు ముందు మధ్యంతర భృతి 20 శాతానికి తగ్గకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మన్యం జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వాలేటి తవిటినాయుడు, కాగాన విజయ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెవర రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు వెంటనే పరిష్కారం చూపండి



వినతులు స్వీకరిస్తున్న డీఆర్వో కేశవనాయుడు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో జి.కేశవనాయుడు, ఆర్డీవో కె.హేమలత ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్రజలు అందించిన అర్జీలపై వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 129 అర్జీలు అందా యి. వాటిలో కొన్ని... 2009-10 మధ్యలో సహారా సంస్థకు ప్రజల నుంచి పార్వతీపురం మన్యం జిల్లా శాఖకు సుమారు రూ.వంద కోట్లు అందాయని తెలిపారు. తర్వాత సహారా సంస్థ మోసం చేయడంతో ప్రజలు నష్టపోయారని, ఆ రూ.వంద కోట్లు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని బాధితులు, ఏజెంట్లు అర్జీ అందించారు. కొమరాడ మండలం కుంతేసు పంచాయతీ జాప్పంగి గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించాలని సర్పంచ్ చోడి పెంటయ్య, గ్రామస్తులు అర్జీ అందించారు. మరికొందరు కూడా సామాజిక, వ్యక్తిగత అంశాలపై ఫిర్యాదులు అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణకు డిమాండ్

గరుగుబిల్లి: గరుగుబిల్లి ఎంపీడీవోగా గతంలో విధులు నిర్వహించిన జి.పైడితల్లిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని నాగూరు ఎంపీటీసీ సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ.. ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎంపీడీవో పైడితల్లి నిధులు దుర్వినియోగం చేసిన విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. మండల సాధారణ నిధులతో పాటు బోరు సామగ్రి కొనుగోలు విషయంలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఎంపీ నిధులతో కొనుగోలు చేసిన ఎల్ఈడీ దీపాలు పక్కదారి పట్టాయని వివరించారు. కురుపాంలో విధులు నిర్వహించిన సమయంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల్లో రూ.కోట్లలో అవకతవకలు జరిగాయని తెలిపారు. ఉపాధిలో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు విజిలెన్స్ అధికారుల దృష్టికి వెళ్లిందన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే జగదీశ్వరి మాట్లాడుతూ పైడితల్లి అక్రమాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి అవసరమైన చర్యలు చేపడతామన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్, జెడ్పీ సీఈవోల దృష్టికి తీసుకెళతామని చెప్పారు. అవినీతికి పాల్పడితే ఎవరినైనా వదిలిపెట్టేది లేదన్నారు.

ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ



సీతంపేట ఐటీడీఏలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో వినతులు వెల్లువెత్తాయి. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 142 వినతులు వచ్చాయి. సామరెల్లిలో ప్రాథమిక పాఠశాల లేని కారణంగా పక్క పంచాయతీ తుంబకొండ గ్రామానికి పిల్లలు ఆటో, బస్సు ద్వారా ప్రయాణం చేస్తున్నారని, బస్సురాని రోజు స్కూల్‌కు వెళ్లలేకపోతున్నారని, గ్రామానికి ప్రాథమిక పాఠశాల మంజూరు చేయాలని ఎం.ఉమామహేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. భామిని మండలం బురుజోల గ్రామానికి చెందిన కె.రాజ్‌కుమార్ తన తండ్రి చనిపోవడం వల్ల ఆర్థికంగా వెనుకబడినందున ప్రైవేటు కళాశాలలో చదవలేకపోతున్నానని, సీతంపేటలో ఉన్న ఐటీఐ శిక్షణా సంస్థలో చదువుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఇలా పలు వినతులు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, పీవో విష్ణుచరణ్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎస్‌వీ రమణ, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి ప్రభాకరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేలా చర్యలు

● ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే విజయచంద్ర



సమస్యలపై వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

పార్వతీపురం రూరల్: మండలంలోని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర వెంకమ్మపేట పంచాయతీలోని తన ఇంటి వద్ద సోమవారం ప్రజా దర్బార్ పేరిట ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సూపర్ పైలెట్ స్కీం ద్వారా ఎప్పటికప్పుడు తాగునీటి సరఫరాలో ఆటంకం ఏర్పడుతోందని పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి, సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పార్వతీపురం పట్టణానికి చెందిన కొంతమంది శానిటేషన్ బాగోలేదని ఎమ్మెల్యేకు వివరించగా, వెంటనే ఆయన.. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేసి, సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. నర్సిపురంలో లోఓల్టేజ్ సమస్య ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు బోనుదేవి చంద్రమౌళి, గొట్టాపు వెంకటరమణ, తవిటినాయుడు తదితరులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి ఏపీ ట్రాన్స్‌కో డీఈతో పాటు ఏఈకి ఫోన్ చేశారు. గ్రామంలో ఎక్కడెక్కడ లోఓల్టేజ్ సమస్య ఉందో పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బార్నాల సీతారాం, చంద్రమౌళిరెడ్డి, శ్రీనివాసరావు, గొట్టాపు వెంకటనాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తప్పిదాలు పునరావృతం కాకూడదు

● గాడి తప్పిన పాలనను సరిచేస్తాం ●ఎమ్మెల్యే జగదీశ్వరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గరుగుబిల్లి : గత ప్రభుత్వంలో మాదిరిగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి హెచ్చరించారు. సోమవారం మండల అభివృద్ధి కార్యాలయంలో శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు ఏకపక్షంగా వ్యవహరించి అభివృద్ధికి ఆటంకం కల్పించారన్నారు. గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిని అవినీతి, అక్రమాలను బయట పెడతామని చెప్పారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలు ఉంటే బిల్లుల చెల్లింపులు నిలిపివేస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అత్యవసర మందులు ఉంచాలని.. పాము కాటు, కుక్క కాటుకు సంబంధించి అప్రమత్తంగా ఉండాలన్నారు. నాడు నేడు పనులతో పాటు పాఠశాల మేనేజ్‌మెంట్ నిధులకు సంబంధించి అక్రమాలకు పాల్పడ్డారని నాగూరు ఎంపీటీసీ సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. మండలంలో అధికారుల చేయి తడపందే పనులు చేయడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కె.జయ, ఎంపీడీవో పి.సూర్యనారాయణ, పార్టీ ప్రతినిధులు ఎ.మధుసూదనరావు, ఎం.పురుషోత్తంనాయుడు, డి.సత్యనారాయణ, అంబటి రాంబాబు, ఎంబీ విజయవాంకుశం, కోట భరత్‌కుమార్, తోటపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ ఆర్నిపల్లి గంగాధర్ నాయుడు, ఎంపీటీసీ సభ్యులు ఎం.సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథుని నిజరూప దర్శనం

పాలకొండ: పట్టణంలో జగన్నాథస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. స్వామివారు సోమవారం నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు మఠం విశ్వనాథదాస్ భక్తులతో ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ ఈవో సర్వేశ్వరరావు స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.





పాలకొండ: నిజరూప దర్శనం, సాలూరు: బుద్ధ, కల్కి అవతారాల్లో..



సాలూరు రూరల్: కొఠియాలో మారు రథయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

బుద్ధ, కల్కి అవతారాల్లో..

సాలూరు: పట్టణంలోని గుండిచా మందిరంలో జగన్నాథుడు సోమవారం బుద్ధ, కల్కి అవతారాలలో భక్తులకు దర్శనమిచ్చారు. సాలూరుతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో చేరుకుని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కొఠియాలో వైభవంగా మారు రథయాత్ర

సాలూరు రూరల్: సాలూరు మండలం గిరిశిఖర గ్రామం కొఠియాలో ఒడిశా ఆధ్వర్యంలో సోమవారం జగన్నాథ బహుదా (మారు రథయాత్ర) వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

18 నుంచి శాకాంబరిదేవి మహోత్సవాలు

పాలకొండ: పట్టణంలోని కోటదుర్గమ్మ అమ్మవారి ఆషాడ మాససారె సహిత శాకాంబరి దేవి మహోత్సవాలు ఈనెల 18, 19 తేదీల్లో నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో బి.మురళీకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాదవర్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమ్మవారికి నూతనంగా ఆషాఢమాసం సారె మహోత్సవాన్ని నిర్వహించేందుకు దేవదాయశాఖ అధికారులతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులు పసుపు, కుంకుమ, గాజులు, అలంకరణ సామగ్రి, చీర, జాకెట్ ముక్క, పళ్లతో పాటు శాకాంబరీదేవి మహోత్సవానికి కావాల్సిన కూరగాయలను ఈనెల 17వ తేదీ బుధవారం సాయంత్రం లోపు ఆలయానికి తీసుకుని రావాలని ఆయన సూచించారు.

జయకృష్ణను సన్మానించిన పవన్



పాలకొండ: పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం సన్మానించారు. నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో గెలుపొందినందుకు మంగళవారం విజయవాడలోని జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో సన్మానించారు. 21 జనసేన ఎమ్మెల్యేను ఆయన సత్కరించారు.

కలెక్టర్‌ను కలిసిన భూదేవి

పాలకొండ: సీతంపేట ఐటీడీఏలో సోమవారం నూతన కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షురాలు పడాల భూదేవి, అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు మర్యాదపూర్వకంగా కలిశారు. భూదేవి నియోజకవర్గంలోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని ప్రసాదరావు వినతిపత్రం అందించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీనిచ్చారు.

రైలును పునరుద్ధరించాలి

గుమ్మలక్ష్మీపురం: రాయగడ పరిసర ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగపడే రాయగడ, గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలును పునరుద్ధరించాలని పార్వతీపురం మన్యం జిల్లా, రాయగడ పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు. గత 20 ఏళ్లగా పాసింజర్ రైలుగా కొనసాగుతున్న దీనిని తర్వాత ఎక్స్‌ప్రెస్‌గా మార్చారని, ఇది ఈ ప్రాంత ప్రయాణి కులకు ఎంతో అనుకూలంగా ఉండేదన్నారు.

కౌలు రైతులను గుర్తించాలి

గరుగుబిల్లి: గ్రామాల్లో అర్హులైన కౌలు రైతులను గుర్తించేందుకు గ్రామ రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని తహసీల్దార్ కె.జయ అన్నారు. సోమవారం ఆమె తహసీల్దార్ కార్యాలయంలో కౌలు రైతులను గుర్తించేందుకు వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల వారీగా పది రోజుల్లో కౌలు రైతులు గుర్తింపు పూర్తి చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి ఆర్.విజయభారతి, ఉప తహసీల్దార్ పి.సత్యలక్ష్మీకుమార్, ఆర్ఐ మండంగి కృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

స్వీపర్ల సమస్యలు పరిష్కరించండి

సీతానగరం: పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటీయు నాయకులు జి.వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయం వద్ద వై.శాంతికుమారి ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల శుభ్రం, పారిశుధ్య పనులు చేస్తున్న స్వీపర్లకు ప్రతి నెల సకాలంలో వేతనాలు చెల్లించాలని, సబ్బులు, గ్లౌజులు, కొబ్బరినూనె సరఫరా చేయాలని కోరుతూ ఎంపీడీఓ ఈశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ స్వీపర్లు ఉష, గౌరమ్మ, తిలోత్తమ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బినామీ బిల్లులపై దర్యాప్తు

భామిని: లివిరి పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో బినామీ బిల్లులు చేశారనే ఫిర్యాదు మేరకు డ్వామా పీడీ రామచంద్రరావు సోమవారం దర్యాప్తు చేశారు. గజపతినగరానికి చెందిన శివ అనే వ్యక్తి బినామీ బిల్లులపై కలెక్టర్ గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేయగా సోమవారం సచివాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, మేట్లుకు ప్రశ్నల వర్షం కురిపించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు కుమ్మక్కై దోపిడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చే శారు. ప్రాథమిక దర్యాప్తులో పనులు చేయకుండా పలువురికి వేతనాలు చెల్లించినట్టు గుర్తించారు. దీనిపై పూర్తి దర్యాప్తు చేయాలని ఏపీవో తులసీదాస్‌ను ఆదేశించారు. ఆయనతో ఏపీడీ శ్రీహరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

పాలకొండ: ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి అని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఎ.విజయరాజ్‌కుమార్ అన్నారు. సోమవారం పాలకొండ సబ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో యువతతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు వాహనాల వేగం తగ్గించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చు

పార్వతీపురంటౌన్: ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని ఏఎస్పీ దిలీప్ కిరణ్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. 12 మంది ఫిర్యాదుదారులకు పోలీసు శాఖ తరుపున అన్ని విధాలుగా ఆదుకుంటామని, చట్టపరిధిలో విచారణ జరిపిస్తామని చెప్పార

కరడవలసలో విద్యుత్ అంతరాయం

సాలూరు రూరల్: గిరిశిఖర గ్రామం కరడవలసలో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో అంధకారంలో ఉంటున్నామని గిరిజనులు వాపోతున్నారు. గత మూడు రోజులుగా విద్యుత్ సరఫరా సక్రమంగా కావడం లేదని కరడవలస గ్రామపెద్ద శంకరరావు సోమవారం స్థానిక విలేకర్లకు తెలిపారు. దీంతో తాగునీటి సేకరణకు ఇబ్బందులు పడుతున్నామని, మొబైల్స్ చార్జింగ్ చేసుకోవడానికి ఇక్కట్లు తప్పడం లేదన్నారు. ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది తమకు సక్రమంగా విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ఏపీఈపీడీసీఎల్ డీఈ రంగారావు మాట్లాడుతూ స్థానికంగా కొందరు చేస్తున్న చర్యలు వల్ల కొంత సమస్య వస్తున్నదని చెప్పారు. తమ సిబ్బందిని పంపించి అవగాహన కల్పిస్తామన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు చైత్రికా కృష్ణ

పాలకొండ: పాలకొండకు చెందిన బొడ్డేపల్లి చైత్రికా కృష్ణ అనే విద్యార్థిని వరుసగా నాలుగో ఏడాది కూడా రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అర్హత సాధించింది. శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న ఇండోర్ స్టేడియంలో ఈనెల 13, 14 తేదీల్లో జరిగిన జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్-15 బాలికల విభాగంలో పాల్గొని ఘనత సాధించింది.

పౌష్టికాహారం పంపిణీ

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, కిశోర్ బాలికలు తీసుకోవాలని నాగూరు ఎంపీటీసీ సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ అన్నారు. చిలకాం గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రంలో సోమవారం కిశోర్ బాలికలకు పౌష్టికాహారాన్ని పంపి ణీ చేశారు ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు..

వీరఘట్టం: రేగులపాడు రైతు సేవా కేంద్రం పరిధిలో సోమవారం ఎరువులు పంపిణీ చేశారు. 20 టన్నుల యూరియా, 20 టన్నుల డీఏపీ అందుబాటులో ఉన్నట్టు వ్యవసాయ సహాయకుడు పి.కృష్ణవంశీ తెలిపారు. తోటపల్లి మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగా రావు రైతులకు ఎరువులు అందించారు. టీడీపీ నాయకులు పొన్నాడ నాగేశ్వరరావు, పారిశర్ల వెంకటరమణ, నల్లబారిక శ్రీనివాసరావు, చిన్న రాము, వర ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం

గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి పీటీజీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సోమవారం యూనిఫారాలు, పుస్తకాలు, పెన్నులు తదితర సామగ్రిని పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేష్, సీనియర్ నాయకులు డొంకాడ రామకృష్ణ, నందివాడ కృష్ణబాబు, కద్రక కళావతి, లావరాజు, సొంటేను రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా

వైభవంగా మారు రథయాత్ర



బహుడ యాత్రలో పాల్గొన్న భక్తులు

రాయగడ: తొమ్మిది రోజల పాటు గుండిచా మందిరంలో సోదర, సోదరి సమేతంగా భక్తులకు వివిధ అవతారాల్లో దర్శనమిచ్చిన జగన్నాథుడు సోమవారం తిరిగి మందిరానికి చేరుకున్నారు. మారు రథాయాత్రలో భాగంగా స్వామివారి మూర్తులను సేవాయిత్‌లు రథంపై అధిష్టంపజేశారు. అనంతరం భక్తుల జయ జయధ్వానాల మధ్య రథం కదిలింది. వేల సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

వ్యాధులపై అవగాహన శిబిరం

రాయగడ: సెరిగుడ మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలో సోమవారం జిల్లా యంత్రాంగం డెంగ్యూ, మలేరియా, డయేరియా వంటి వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేసింది. ఈ శిబిరంలో జిల్లా పాలనాధికారి మనోజ్ సత్యవాన్ మహాజన్ పాల్గొని, మాట్లాడారు. విద్యార్థులు వ్యాధుల పట్ల అవగాహన కలిగిఉండాలని, హాస్టల్ విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంఘమిత్ర దేవి, సంక్షేమ అధికారి మలయరంజన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ప్రాజెక్టులతో భవితకు సోపానం

రాయగడ: నేడు యువత నైపుణ్యంతో ఆవిష్కరిస్తున్న కొత్త ప్రాజెక్టులు భవితకు సోపానంగా మారబోతున్నాయని అదనపు కలెక్టర్ భాస్కర్‌రోయత్ అన్నారు. స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రసంగించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న అసిస్టెంట్ డైరెక్టర్ ఎంఎస్ఎన్ కోటిరత్నం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతిఒక్కరి మదిలో వినూత్న ఆలోచనలు సాక్షాత్కరిస్తాయన్నారు. ఇటీవల నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసి, పూర్వ విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అతుల్యకుమార్ పండా, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థికి సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ రోయత్ తదితరులు